# పరలోకం

teluguislam.net

హదీస్ పబ్లికేషన్స్
హైదరాబాద్

**PARALOKAM (Telugu)** آخرت

Compiled by: **ISLAMIC GUIDENCE CENTRE KSA**

*All Rights Reserved with Publishers*

First Edition: January 2007

Fifth Edition: Setember 2012

Copies : 3000

**Price : Rs. 12/-**

**Published by : HADITH PUBLICATIONS**

**S. Abdul Wahid** H.No. 8-4-549/314, Netaji Nagar, Erragadda, Hyderabad-18 (A.P.) India. Ph: 040-23700081

*Copies can be had from* పుస్తకాలు లభించు చిరునామా :

**AZIZUR RAHMAN YUNUS**
S/o. H.Md. Abdur Rawoof Umari
# 80-11/129E-5-1, Abbas Nagar,
Karnool-2 Ph: 9849492445
Cell: 8121217938

**DECCAN TRADERS**
Moghalpura, Near Water Tank
Hyderabad. Tel: 040-66490230

**HAFIZ FAROOQ MADANI**
Islamic Guidence Centre,
Haill, KSA.
Cell: 00966502985504

**FAROOQ BASHA KHAN**
H.No. 11-1-25, B.R.P. Road,
Islampet, Vijayawada -520001
Phone: 9849378668

**MD. ABDUL KALAM**
H.No. 16-415/29, Gangula Thota,
Machilipatnam,Krishna-521002
Cell : 9247234211

**SYED NOOR**
Al-Ahasaa- Al Afoo,
Kingdom of Saudi Arebia
Cell: 00966507947212

***FOR FREE BOOKS***

**ANDHRA KITCHENWARES**
# 40-20, Park Road,
Kurool .-518 001.
Tel : 9866392805

**HAROON ANSARI (SALEEM)**
# Edare Fiqr-e-Akhirath
Toli Chowki, HYD.
Tel : 9440296104

﴿ بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ ﴾

# విషయ సూచిక


| | |
|---|---|
| పుస్తకం ప్రారంభం | 04 |
| మరణం | 06 |
| సమాధి | 13 |
| ప్రళయం- దాని సూచనలు | 19 |
| నరకం - నరక శిక్షలు | 34 |
| స్వర్గము | 38 |

## బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీమ్

ప్రశంసలూ, పొగడ్తలన్నీ కూడా సర్వ లోకాలకూ పరిపోష కుడైన అల్లాహ్‌కే శోభిస్తాయి. మహాప్రవక్తపై, ఆయన కుటుంబీకులపై, ఆయన అనుచరులపై అల్లాహ్ యొక్క శాంతీకారుణ్యాలు కురియుగాక! ఆమీన్.

ప్రశంసలు, ప్రార్థనల అనంతరం.....

ఇస్లామీయ విశ్వాసానికి ఆరు మూల స్తంభాలున్నాయి. వాటిలో ఒకటి పరలోక విశ్వాసం. దైవ గ్రంథమైన ఖుర్‌ఆన్‌లో, ప్రవక్త (సఅసం) గారి ప్రవచనాల (హదీసుల)లో ఈ పరలోకం గురించి ఏ విధంగానయితే తెలుపబడిందో, ఆ విధంగా విశ్వసించనంత వరకూ ఏ వ్యక్తీ ముస్లిం (విశ్వాసి) కాజాలడు. పరలోక విషయాలను తెలుసుకోవటం, ఎల్లప్పుడూ వాటిని జ్ఞాపకం ఉంచుకోవటం ఒక ముస్లింకు చాలా అవసరం. దీనిమూలంగా ఆత్మశుద్ధి జరుగుతుంది. మనసులో దైవభీతి జాగృతమవుతుంది. ఇస్లాంపై స్థిరంగా ఉండే సౌభాగ్యం కలుగుతుంది. హృదయాలను కఠినంగా మారటంలో, పాపానికి ఒడిగట్టే

ధైర్యాన్ని ఇవ్వటంలో- పరలోక శిక్షల బాధల పట్ల అశ్రద్ధ కంటే ప్రమాదకరమైనది మరొకటి లేదు. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

﴿ يَوماً يَجْعَلُ الْوِلْدَانَ شِيبًا﴾ المزمل:١٧

"ఆ రోజు బాలురను సయితం ముసలివారుగా చేయు నంత (కఠినం)గా ఉంటుంది." (ముజ్జమ్మిల్-17)

మరోచోట ఇలా సెలవిచ్చాడు:

﴿ يَاأَيُّهَا النَّاسُ اتَّقُوا رَبَّكُمْ إِنَّ زَلْزَلَةَ السَّاعَةِ شَيْءٌ عَظِيمٌ. يَوْمَ تَرَوْنَهَا تَذْهَلُ كُلُّ مُرْضِعَةٍ عَمَّا أَرْضَعَتْ وَتَضَعُ كُلُّ ذَاتِ حَمْلٍ حَمْلَهَا وَتَرَى النَّاسَ سُكَارَى وَمَا هُمْ بِسُكَارَى وَلَكِنَّ عَذَابَ اللهِ شَدِيدٌ ﴾ الحج: ١-٢

"ఓ ప్రజలారా! మీరు మీ ప్రభువుకు భయపడండి. నిస్సందేహంగా ప్రళయం నాటి భూకంపం చాలా తీవ్రమైన విషయం. ఆ రోజున మీరు చూస్తారు, పాలిచ్చే తల్లి తన చంటిబిడ్డనే మరిచిపోతుంది. గర్భిణీ స్త్రీ యొక్క గర్భం జారిపడిపోతుంది. ఆ సమయంలో ప్రజలు మత్తులో ఉన్నట్లు అగుపిస్తారు. (నిజానికి) వారు మత్తులో ఉండరు. దైవశిక్షే అంత కఠినంగా ఉంటుంది." (హజ్:1-2)

# మరణం

ఇహలోక జీవిత ప్రయాణంలో ప్రతి జీవికి ఇది ఆఖరి మజిలి.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

﴿ كُلُّ نَفسٍ ذَائِقَةُ الْمَوْت ﴾ آل عمران: ١٨٥

"ప్రతి మనిషి చావుని చవి చూస్తాడు."

(ఆలి ఇమ్రాన్: 185)

మరో చోట ఇలా సెలవిచ్చాడు:

﴿ كُلُّ مَنْ عَلَيْهَا فَان ﴾ الرحمن: ٢٦

"భూమిపై నుండే ప్రతిదీ నశించేదే." (రహ్మాన్:26)

ప్రత్యేకంగా ప్రవక్తను సంబోధిస్తూ ఇలా అన్నాడు:

﴿ إِنَّكَ مَيِّتٌ وَإِنَّهُمْ مَيِّتُون ﴾ الزمر: ٣٠

"నీవూ చనిపోయేవాడివే, అలాగే వారు కూడా చని పోవలసినవారే." (జుమర్:30)

ప్రపంచంలో ఏ మానవుడూ శాశ్వతంగా ఉండలేడు. అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

﴿ وَمَا جَعَلْنَا لِبَشَرٍ مِّن قَبْلِكَ الْخُلْدَ ﴾ الأنبياء: ٣٤

"నీకు పూర్వం కూడా మేము ఏ మానవుణ్ణీ శాశ్వతముగా జీవించేవానిగా చేయలేదు." (అంబియా: 34)

పుట్టిన జీవి గిట్టుట ఖాయమనేది జగమెరిగిన సత్యం. అందులో సందేహానికి అసలు తావే లేదు. అయినప్పటికీ చాలా మంది ఈ విషయంలో చాలా అజాగ్రత్తతో వ్యవహరిస్తున్నారు. ఎవరి సంగతి ఎలా ఉన్నా అల్లాహ్‌ను, అంతిమ దినాన్ని విశ్వసించే ఒక ముస్లిం మాత్రం దానిని ఎట్టి పరిస్థితిలోనూ మరిచిపోకూడదు. పైగా అత్యంత ఎక్కువగా దాన్ని జ్ఞాపకం ఉంచుకోవాలి. పరలోక జీవితం కోసం సదా సిద్ధంగా ఉండాలి. జీవితపు విలువైన సమయాన్ని వృధాగా ఖర్చు చేయకూడదు. చావు రాకముందే పరలోక జీవితానికి ఉపయోగపడే సామగ్రిని (అంటే సదాచరణలను) సిద్ధం చేసుకోవాలి. ప్రవక్త (సఅసం) ఇలా ప్రబోధించారు:

(( اغْتَنِمْ خَمْسًا قَبْلَ خَمْسٍ: حَيَاتَكَ قَبْلَ مَوْتِكَ، وَ صِحَّتَكَ قَبْلَ سَقَمِكَ، وَ فَرَاغَكَ قَبْلَ شُغْلِكَ، وَ شَبَابَكَ قَبْلَ هَرَمِكَ، وَ غِنَاكَ قَبْلَ فَقْرِكَ))

"ఐదు విషయాలను మరో ఐదు విషయాల కంటే మేలైన అవకాశాలుగా భావించండి. చావుకి ముందు జీవితాన్ని, అనారోగ్యానికి ముందు ఆరోగ్యాన్ని, పనుల మోపుకు ముందు తీరికను, వృద్ధాప్యానికి ముందు యవ్వనాన్ని, బీదరికానికి ముందు సంపన్నతను సౌభాగ్యంగా తలపోయండి." (ఈ హదీసును హాకిమ్ తన గ్రంథంలో, బైహఖీ 'షోబుల్ ఈమాన్'లో ఉల్లేఖించారు)

ఇక్కడ మనం తెలుసుకోవలసిన విషయం ఏమిటంటే మరణించిన మనిషి ఇహలోకంలోని తన సిరిసంపదలను, ధనకనక రాసులను తన వెంట సమాధిలోకి తీసుకెళ్ళలేడు. తాను చేసుకున్న మంచిపనులు మాత్రమే అక్కడికి తన వెంట వస్తాయి. అందుకోసం, ఓ ప్రజలారా! ఇహలోకం నుంచి పరలోకానికి సత్కార్యాల సామగ్రిని వెంట తీసుకెళ్ళే ప్రయత్నం చేయండి. దానిమూలంగానే మీరు అక్కడ సుఖాలు పొందగల్గుతారు. అల్లాహ్ దయతో అక్కడి శిక్షల నుండి కూడా రక్షణ పొందుతారు.

2) మనిషి చావు ఎవరూ తెలుసుకోలేని రహస్యం. దాని గురించి ఒక్క దేవునికి తప్ప మరెవరికీ తెలియదు. చావు ఎవరికి ఎప్పుడు వస్తుందో, ఎక్కడ వస్తుందో ఎవరూ చెప్పలేరు. ఎందుకంటే ఇది అగోచర జ్ఞానం (ఇల్మె గైబ్) లోని విషయం. కనుక దీని గురించి దేవునికి మాత్రమే తెలుస్తుంది.

3) మరణ ఘడియలు సమీపించిన మీదట ఇక దాన్ని వాయిదా వేయుటం, దాటవేయుటం, చావు నుంచి తప్పించుకుని పారిపోవటం కానిపని. అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

﴿ وَلِكُلِّ أُمَّةٍ أَجَلٌ فَإِذَا جَاءَ أَجَلُهُمْ لَا يَسْتَأْخِرُونَ سَاعَةً وَلَا يَسْتَقْدِمُونَ﴾ الأعراف: ٣٤

"ప్రతి జాతివారికీ ఒక గడువు నిర్ణయించబడి ఉన్నది. ఆ గడువు వచ్చినప్పుడు వారు ఒక గడియ వెనక్కిగాని, ఒక గడియ ముందుకుగాని జరగలేరు." (అరాఫ్:34)

4) విశ్వాసి వద్దకు మరణాన్నిచ్చే దూత (మలకుల్ మౌత్) సువాసన కలిగిన దుస్తులతో వస్తాడు. అతని ముఖం అందంగా ఉంటుంది. అతనితో పాటు కారుణ్యదూతలు

కూడా వస్తారు. మృత్యువు ముఖంలో ఉన్న ఆ విశ్వాసికి స్వర్గలోక శుభవార్తలను అందజేస్తూ అతని వద్ద హాజరవుతారు. ఈ విషయాన్నే అల్లాహ్ దివ్య ఖుర్ఆన్‌లో ఈ విధంగా తెలిపాడు:

﴿ إِنَّ الَّذِينَ قَالُوا رَبُّنَا اللَّهُ ثُمَّ اسْتَقَامُوا تَتَنَزَّلُ عَلَيْهِمُ الْمَلَائِكَةُ أَلَّا تَخَافُوا وَلَا تَحْزَنُوا وَأَبْشِرُوا بِالْجَنَّةِ الَّتِي كُنتُمْ تُوعَدُونَ ﴾ فصلت: ٣٠

“ఎవరయితే ‘మా ప్రభువు అల్లాహ్’ అని పలికి, ఆ తర్వాత దానిపై స్థిరంగా ఉంటారో, వారి దగ్గరికి దైవ దూతలు దిగివచ్చి, ‘మీరు భయపడకండి, చింతించకండి. మీకు వాగ్దానం చేయబడుతున్న స్వర్గం పట్ల సంతోషించండి’ అని అంటారు.” (హామీమ్ అస్సజ్దహ్:30)

దీనికి భిన్నంగా అవిశ్వాసి వద్దకు మరణ దూత (మలకుల్ మౌత్) అత్యంత భయంకరమైన నల్లటి రూపంలో వస్తాడు. అతని దుస్తుల్లో నుంచి దుర్వాసన వస్తూ ఉంటుంది. అతనితోపాటు శిక్షించే దూతలు ఆ అవిశ్వాసికి శిక్షల ‘శుభవార్త’ను అందజేస్తూ హాజరవుతారు. దీని గురించి ఖుర్ఆన్‌లో ఇలా వివరించబడింది:

﴿ وَلَوْ تَرَىٰ إِذِ الظَّالِمُونَ فِي غَمَرَاتِ الْمَوْتِ وَالْمَلَائِكَةُ بَاسِطُوا أَيْدِيهِمْ أَخْرِجُوا أَنفُسَكُمُ الْيَوْمَ تُجْزَوْنَ عَذَابَ الْهُونِ بِمَا كُنتُمْ تَقُولُونَ عَلَى اللَّهِ غَيْرَ الْحَقِّ وَكُنتُمْ عَنْ آيَاتِهِ تَسْتَكْبِرُونَ ﴾ الأنعام: ٩٣

"ఈ దుర్మార్గులు మరణవేదనలో మునిగి తేలుతూ ఉండగా, దైవదూతలు తమ హస్తాలను చాచి 'ఇటు తెండి! బయటకు తీయండి మీ ప్రాణాలను, అల్లాహ్‌పై అప నిందను మోపి అన్యాయంగా కూసిన కూతలకూ, ఆయన ఆయతుల పట్ల తలబిరుసుతనం ప్రదర్శించినందుకూ ఫలితంగా ఈ రోజు మీకు అవమానకరమైన శిక్ష విధించ బడుతుంది" అని అంటూ ఉండగా ఆ దృశ్యాన్ని నీవు చూడగలిగితే ఎంత బాగుంటుంది!" (అన్‌ఆమ్:93)

చావు వచ్చినప్పుడు వాస్తవం తేటతెల్లమవుతుంది. అసలు సంగతేమిటో ప్రతి ఒక్కరికి బోధపడుతుంది. అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

﴿حَتَّىٰ إِذَا جَاءَ أَحَدَهُمُ الْمَوْتُ قَالَ رَبِّ ارْجِعُونِ. لَعَلِّي أَعْمَلُ صَالِحًا فِيمَا تَرَكْتُ كَلَّا إِنَّهَا كَلِمَةٌ هُوَ قَائِلُهَا وَمِن وَرَائِهِم بَرْزَخٌ إِلَىٰ يَوْمِ يُبْعَثُونَ ﴾ المؤمنون: ٩٩، ١٠٠

"చివరికి వారిలో ఎవరికయినా మరణం వచ్చినప్పుడు, అతను 'ఓ నా ప్రభూ! నన్ను తిరిగి పంపి వేయి. నేను

ఇంతకు ముందు ఉన్న దానిలో సత్కార్యాలు చేసి వస్తాను' అని అంటాడు. అది కేవలం అతని నోటి మాట. దాన్ని అతను అలా పలుకుతాడు. మరణించినవారు మళ్ళీ సజీవులై లేచే రోజు వరకు వారి ముందు ఒక అడ్డు ఉంటుంది." (మూమినూన్: 99,100)

మరణానంతరం అవిశ్వాసులు, పాపాత్ములు మరోసారి ఇహలోకానికి తిరిగివచ్చి సత్కార్యాలు చేయాలని ఉవ్విళ్ళూరుతారు. కాని అప్పుడు ఆ పశ్చాత్తాపం వారికి ఏ విధంగానూ పనికిరాదు. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

﴿ وَ تَرَى الظَّالِمِينَ لَمَّا رَأَوُا الْعَذَابَ يَقُولُونَ هَلْ إِلَى مَرَدٍّ مِن سَبِيلٍ ﴾ الشورى: ٤٤

"నీవు పాపాత్ములను చూస్తావు. వారు శిక్షను చూసినప్పుడు తాము తిరిగి పోవటానికి ఏదయినా మార్గం ఉందా? అని అంటూ ఉంటారు." (షూరా: 44)

అల్లాహ్ తన దాసులకు ప్రసాదించిన గొప్ప వరాల్లో ఒకటి ఏమిటంటే, మరణానికి ముందు ఎవరి చివరి మాట 'లా యిలాహ ఇల్లల్లాహ్' అవుతుందో, వారికి స్వర్గం ప్రాప్తించటం. ప్రవక్త (సఅసం) ఇలా ప్రవచించారు:

(( مَنْ كَانَ آخِرُ كَلَامِهِ ، لَآ إِلٰه إِلَّا اللهُ دَخَلَ الْجَنَّةَ )) أبو داود ر.ح: ٣١١٤

"ఈ ప్రపంచంలో ఎవరి చివరి పలుకు 'లా ఇలాహ ఇల్లల్లాహ్' అవుతుందో, వారు స్వర్గంలోకి ప్రవేశిస్తారు."

దీనికి కారణం ఏమిటంటే అటువంటి క్లిష్ట సమయంలో మనిషి నోటి నుంచి కలిమహ్ (అంటే 'లా ఇలాహ ఇల్లల్లాహ్' అనే సద్వచనం) వెలువడటం చాలా కష్టం. ఆరోగ్యంగా ఉన్నప్పుడు మనస్ఫూర్తిగా ఆ కలిమాను పఠించి దాని భావాన్ని బాగా ఆకళింపు చేసుకొని దాని ప్రకారం ఆచరించిన దృఢచిత్తులకు మాత్రమే ఆ అదృష్టం కలిగే వీలుంటుంది. సామాన్య పరిస్థితుల్లో ఆ కలిమాను మనస్ఫూర్తిగా పఠించని వ్యక్తి మరణ సమయం దగ్గరికొచ్చే సరికి ఆ స్థితిలో కలిగే వేదనను, బాధను, కష్టాన్ని భరించలేక దాన్ని మరిచిపోతాడు. అందుకే మృత్యుముఖంలో ఉన్నవారిని కలిమా పఠించేందుకు ప్రోత్సహించాలని, అది పుణ్యకార్యమని చెప్పబడింది.

## సమాధి

ప్రవక్త (సఅసం) ఇలా ప్రబోధించారు: మరణించిన

వ్యక్తిని సమాధిలో పూడ్చిపెట్టి అతని బంధుమిత్రులందరూ తిరిగి వెళ్తున్నప్పుడు ఆ శవం వారి చెప్పుల శబ్దం వింటుంది. అప్పుడు ఇద్దరు దూతలు వచ్చి అతన్ని కూర్చోబెట్టి (దైవ ప్రవక్త గురించి ప్రస్తావిస్తూ), "ప్రపంచంలో ఇతని గురించి నీ అభిప్రాయం ఏమై ఉండేది?" అని ప్రశ్నిస్తారు. ఆ మరణించిన వ్యక్తి గనక విశ్వాసి అయి ఉంటే " (ఆ వ్యక్తా?) అతను అల్లాహ్ దాసుడు మరియు అయన యొక్క ప్రవక్త అని నేను సాక్ష్యమిస్తున్నాను" అంటాడు. అతని జవాబు విన్న తర్వాత దైవదూతలు అతనితో,"ఇదిగో నరకంలోని ఈ స్థలాన్ని చూడు. దీనికి బదులుగా స్వర్గంలో ఈ స్థలము అల్లాహ్ నీకు ప్రసాదించాడు" అని చెబుతారు. అతడు (స్వర్గం, నరకం) రెండూ చూస్తాడు. అలాగే మరణించిన అవిశ్వాసిని కూడా దైవదూతలు "ప్రపంచంలో ఇతని గురించి నీ అభిప్రాయం ఏమై ఉండేది?" అని ప్రశ్నిస్తారు. "నాకేమీ తెలియదు. లోకులు అయన గురించి ఏదయితే చెబుతూ ఉండేవారో నేనూ అదే చెప్పాను" అని అంటా డతడు. అతని జవాబు విన్న దైవదూతలు "నీవు ఎందుకు తెలుసుకోలేదు, ఖుర్ఆన్ ఎందుకు చదవలేదు" అంటూ

ఇనుప గదలతో అతన్ని బాగా వాయిస్తారు. ఆ వాయింపుకు అతను గావుకేకలు పెడతాడు. అప్పుడు అతను పెట్టే కేకను ఉభయజాతులు (మానవులు, జిన్నాతులు) మినహా సమీపంలో ఉన్న జీవరాసులన్నీ వింటాయి.

(బుఖారి, ముస్లిం)

అయితే ఇక్కడ ఒక సందేహం కలగటం సహజం. మరణానంతరం మృత్యుదూతలు మనిషి యొక్క ఆత్మను ఊర్ధ్వ లోకాలకు తీసుకుపోతారు కదా! అది తిరిగి సమాధి లోకి ఎలా పంపబడుతుంది?! చూడండి! ఇది పూర్తిగా పరలోకానికి సంబంధించిన విషయం. పరలోకం మనిషి ఊహలకు అంచనాలకు అందనిది. సమాధిలో బహుమతు లకు అర్హులైన విశ్వాసులకు బహుమతులు ప్రసాదించ బడటం, అలాగే శిక్షలకు అర్హులైన అవిశ్వాసులకు శిక్షలు విధించబడటం వాస్తవమే నన్నదానిపై ముస్లింలందరూ ఏకాభిప్రాయంతో ఉన్నారు. ఈ విషయమై దివ్య ఖుర్‌ఆన్ ద్వారా కూడా మనకు కొన్ని సూచనలు అందుతున్నాయి. ఉదాహరణకు ఈ ఆయతును గమనించండి:

﴿ النَّارُ يُعْرَضُونَ عَلَيْهَا غُدُوًّا وَعَشِيًّا وَيَوْمَ تَقُومُ السَّاعَةُ أَدْخِلُوا آلَ فِرْعَوْنَ أَشَدَّ الْعَذَابِ ﴾ المؤمن: ٤٦

"వారు ఉదయం సాయంత్రం నరకాగ్ని ముందు ఉంచబడుతూ ఉంటారు. ప్రళయ గడియ వచ్చినప్పుడు 'ఫిరౌన్ ప్రజలను తీవ్రమైన శిక్షలో ప్రవేశింపజెయ్యండి' అని ఆజ్ఞాపించబడుతుంది." (మోమిన్: 46)

దైవప్రవక్త (సఅసం) ఇలా ప్రబోధించారు:

(( تَعَوَّذُوا بِاللهِ مِن عَذَابِ الْقَبر )) رواه مسلم

"సమాధి శిక్షల నుంచి అల్లాహ్ శరణు వేడుకోండి." (ముస్లిం గ్రంథంలో ఈ హదీసు ఉంది)

పాశ్చాత్య భౌతిక భావాలకు భీతిల్లిపోతున్న ప్రబుద్ధులు కొందరు సమాధిలో శిక్షాబహుమానాలుంటాయనే విషయాన్ని నమ్మ నిరాకరించారు. కాని బుద్ధీ జ్ఞానాలతో అలోచించి చూస్తే దీన్ని నిరాకరించటంలో అర్థం లేదని బోధపడుతోంది. సమాధి శిక్షబహుమానాలను నిరూపించే ఉపమానాలెన్నో మన కళ్ళముందుకు వస్తుంటాయి. ఎంతో దూరం ఎందుకు? నిద్రనే తీసుకోండి. నిద్ర పోతున్న వ్యక్తి

ఏవేవో కలలుగంటాడు. కలలోనే బాధను అనుభవిస్తాడు, సంతోషాన్ని కూడా పొందుతాడు. ఒక్కోసారి పీడకలలు వచ్చినప్పుడు 'కల'లోనే అరుస్తాడు, రక్షించమని పిలు స్తుంటాడు. కాని ప్రక్కనున్న వారికి సైతం అతని పరిస్థితి అర్థం కాదు. మరిచూడబోతే అతనూ బతికున్నాడు, మనమూ బ్రతికున్నాం. బ్రతికున్న వాళ్ళల్లోనే ఇంత తేడా ఉన్నప్పుడు చనిపోయినవారు ఎటువంటి పరిస్థితుల్ని ఎదుర్కొంటున్నారో మనం గ్రహించగలమా?

సమాధిలో విధించబడే శిక్ష ఆత్మకూ దేహానికి రెండిం టికీ వర్తిస్తుంది. ప్రవక్త (సఅసం) ఇలా చెప్పారు: సమాధి పరలోకం యొక్క తొలి మెట్టు. దాన్ని క్షేమంగా దాటిన వారికి ఆ తరువాత చాలా సుఖం ఉంటుంది. దీనికి భిన్నంగా దాన్ని క్షేమంగా దాటని వారికి తర్వాత చాలా కష్టాలు ఎదురవుతాయి. (తిర్మిజీ)

కనుక విశ్వాసులు అత్యధికంగా సమాధి శిక్షల నుండి అల్లాహ్ శరణు వేడుకుంటూ ఉండాలి. ముఖ్యంగా నమాజ్‌లో సలామ్‌కు ముందు ఈ విషయాన్ని దృష్టిలో

ఉంచుకోవాలి. అంతేకాదు, సమాధి శిక్షలకు, నరక యాతనలకు గురిచేసే పాపాలకు బహు దూరంగా ఉండాలి.

అయితే సమాధుల్లో పూడ్చిపెట్టబడే వారికి మాత్రమే ఈ సమాధి శిక్ష కలుగుతుంది, వేరితరులకు ఈ శిక్షలు ఎదురయ్యే అవకాశం లేదని భావిస్తే పొరబడినట్లే సుమా! మరణించినవారిలో చాలామందిని సమాధిలోనే పూడ్చిపెడతారు కాబట్టి, శవాలన్నీ కూడా ఆఖరికి మట్టిలోనే కలిసిపోతాయి కాబట్టి సమాధి శిక్ష (అజాబె ఖబ్ర్) అని వ్యవహరించబడింది. అంతేగాని నిజం చెప్పాలంటే, నీటిలో మునిగిపోయినవారికి, మంటల్లో కాలిపోయినవారికి, క్రూర మృగాలకు ఆహారంగా మారిపోయిన వారందరికి కూడా సమాధి శిక్షాబహుమానాలుంటాయి. ఇహలోక జీవితానికి - పరలోక జీవితానికి మధ్యన ఉండే ఈ స్థితిని "బర్జఖ్ స్థితి" అని అంటారు. సమాధిలో విధించబడే శిక్షలు వివిధ రకాలుగా ఉండవచ్చు. ఇనుప గదలతో కొట్టబడటం, సమాధి చీకటితో నిండిపోవటం, నరక పాన్పు, నరక

ద్వారాలు తెరువబడటం మొదలగునవి. ప్రపంచంలో చేసిన చెడుపనులు దుర్వాసనను వెదజల్లుతూ, అత్యంత వికృతమైన, భయంకరమైన రూపంలో దగ్గరికి వస్తాయి. అవిశ్వాసులకు, కపటులకు ఈ శిక్షలు శాశ్వతంగా ఉంటాయి. అదే విశ్వసించిన వారయితే వారి పాపాలకు తగిన విధంగా శిక్షించిన తర్వాత శిక్ష ఆపబడుతుంది.

నికార్సయిన విశ్వాసుల సమాధి సువిశాలమయి పోతుంది. అందులో వెలుగు నింపబడుతుంది. స్వర్గం నుంచి గాలి వీస్తుంది. స్వర్గ పరిమళం గుభాళిస్తుంది. స్వర్గ పాన్పు సిద్ధం చేయబడుతుంది. ప్రపంచంలో వారు చేసుకున్న మంచిపనులు సువాసనలు వెదజల్లుతూ అందమైన రూపంలో వారి దగ్గరకు వస్తాయి.

## ప్రళయ దినం - దాని సూచనలు

1) అల్లాహ్ ఈ లోకాన్ని ఎల్లకాలం ఉంచటానికి సృష్టించలేదు. ఏదో ఒకరోజు ఇది అంతం కానుంది. ఆ రోజే "ఖియామత్ రోజు". సందేహాలకు ఏమాత్రం తావులేని

అత్యంత యదార్థ విషయం ఇది. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

﴿ إِنَّ السَّاعَةَ آتِيَةٌ لا رَيبَ فِيهَا ﴾ الحج: ٧

"ప్రళయం రానున్నది. అందులో ఎలాంటి సందేహం లేదు." (హజ్:7)

మరో చోట ఇలా సెలవిచ్చాడు:

﴿ وَقَالَ الَّذِينَ كَفَرُوا لاَ تَأْتِينَا السَّاعَةُ قُلْ بَلَى وَرَبِّي لَتَأْتِيَنَّكُمْ ﴾ سبا:٣

"మాకు ప్రళయం రాదు అని అవిశ్వాసులు అంటారు. నీవు చెప్పు: ఎందుకు రాదు? అది మీపై తప్పక వస్తుంది." (సబా:3)

ప్రళయ దినం సమీపంలోనే ఉంది. దాని గురించి అల్లాహ్ ఇలా తెలిపాడు:

﴿ اِقْتَرَبَتِ السَّاعَة ﴾ القمر: ١

"తీర్పు దినము సమీపించినది." (ఖమర్: 1)

మరో చోట ఇలా అన్నాడు:

﴿ اِقْتَرَبَ لِلنَّاسِ حِسَابُهُمْ وَهُمْ فِي غَفْلَةٍ مُعْرِضُون ﴾ الأنبياء: ١

"ప్రజలకు తీర్పు కాలము సమీపించినది. అయినా వారు అజాగ్రత్తలోపడి విముఖులై ఉన్నారు."

(అంబియా: 1)

సమీపంలో ఉన్నది అంటే ఎంత సమీపంలో ఉంది? అని అడిగితే దానికి సమాధానం లేదు. ఎందుకంటే దానిని మనం అంచనా వేయలేము కాబట్టి! మానవులకు ఆ విషయం తెలియదు. దానికి సంబంధిం చిన సరైన జ్ఞానం కేవలం అల్లాహ్‌కు మాత్రమే ఉంది.

ప్రళయ దిన విషయం అగోచర జ్ఞానానికి (ఇల్మె గైబ్‌కు) సంబంధించినది. అది కేవలం అల్లాహ్‌కు మాత్రమే తెలుసు. ఆ విషయాన్ని ఆయన తన సృష్టిలో ఎవరికీ తెలుపలేదు. అల్లాహ్ ఇలా అంటున్నాడు:

﴿ يَسْأَلُكَ النَّاسُ عَنِ السَّاعَةِ قُلْ إِنَّمَا عِلْمُهَا عِندَ اللهِ وَمَا يُدْرِيكَ لَعَلَّ السَّاعَةَ تَكُونُ قَرِيبًا ﴾ الاحزاب:٦٣

"ప్రజలు ప్రళయ కాలమును గూర్చి నిన్ను అడుగుతున్నారు. దాని గురించి అల్లాహ్‌కే తెలుసు అని ఓ ప్రవక్తా! వారికి చెప్పు. దాని గురించి నీకేం తెలుసు? ప్రళయ కాలం

సమీపంలోనే ఉండవచ్చు." (అహ్‌జాబ్: 63)

ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రళయానికి ముందు వచ్చే సూచనలను గురించి మాత్రం సూచించారు. వాటిలో కొన్ని క్రింద పేర్కొనబడుతున్నవి.

**మొదటి సూచన:** ప్రళయానికి ముందు మసీహుద్దజ్జాల్ అవతరిస్తాడు. అతని రాకతో ప్రపంచంలో ఘోరమైన అరాచకం ప్రబలిపోతుంది. అల్లాహ్ తనకు ఇచ్చిన శక్తి సామర్థ్యాలను అతడు ప్రజలకు చూపిస్తాడు. దాంతో చాలా మంది మోసపోతారు. అతను ఆకాశాన్ని అజ్ఞాపిస్తే అది వర్షాన్ని కురిపిస్తుంది. అతని అజ్ఞతో క్షణాల్లో మొక్కలు మొలకెత్తుతాయి. అతను చచ్చిపోయినవారిని బ్రతికించి చూపుతాడు. అలాంటివే మరికొన్ని వింతలు చూపిస్తాడు. ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) చెప్పారు: అతను ఒంటికన్నువాడై ఉంటాడు. అతను స్వర్గం నరకం లాంటివే రెండు వస్తువులను ప్రజలకు చూపిస్తాడు. వాస్త వానికి అతను స్వర్గం అని చెప్పేది నరకం అయి ఉంటుంది. నరకం అని చెప్పేది స్వర్గం అయి ఉంటుంది. అతడు

భూమిపై 40 రోజులు నివసిస్తాడు. ఒక రోజు ఒక సంవత్సరమంత, మరో రోజు ఒక నెలంత, ఇంకో రోజు ఒక వారమంత ఉంటుంది. మిగతా రోజులు సామాన్య రోజుల మాదిరిగానే ఉంటాయి. అతను మక్కా మదీనాలు తప్ప మిగతా దేశాలన్నీ తిరుగుతాడు.

రెండవ సూచన: ఈసా ప్రవక్త (అలైహిస్సలామ్) డెమాస్కస్ (damascus)కు తూర్పు దిక్కున తెల్లని స్తంభము (మీనార్) నుండి ఫజ్ర్ నమాజ్ సమయంలో దిగివస్తారు. (డెమాస్కస్ సిరియా దేశపు రాజధాని.) ఫజ్ర్ నమాజును సామూహికంగా (జమాఅత్‌తో) నెరవేర్చి దజ్జాల్‌ను (ఉపద్రవాగ్రేసరుణ్ణి) వెతికి మరీ సంహరిస్తారు.

మూడవ సూచన: సూర్యుడు పశ్చిమ దిశ నుంచి ఉదయిస్తాడు. ఆ వింత చూసి చాలామంది భయంతో వణికి పోయి (ఇస్లామే సత్యమని) విశ్వసిస్తారు. ఇవే గాకుండా మరెన్నో సూచనలు ఉన్నాయి.

2) ఖియామత్ వచ్చినప్పుడు ఈ భూమిపై కేవలం దుర్మార్గులు, దుష్టులు మాత్రమే మిగిలి ఉంటారు. అది

ఏ విధంగానంటే, ఖియామత్‌కు ముందు ఒక రకమైన గాలి వీస్తుంది. దాంతో విశ్వాసులు చనిపోతారు. ఇక ఆ తర్వాత అల్లాహ్ సృష్టినంతటినీ ధ్వంసం చేసి ప్రపంచాన్ని నశింపజేయాలనుకున్నప్పుడు "సూర్" (శంఖం) ఊదమని ఇస్రాఫీల్ దూతకు ఆజ్ఞాపిస్తాడు. ఆ సూర్ శబ్దం విన్న వారంతా స్పృహ తప్పి పడిపోతారు. దానినే అల్లాహ్ ఈ వాక్యంలో తెలిపాడు:

﴿وَنُفِخَ فِي الصُّورِ فَصَعِقَ مَنْ فِي السَّمَاوَاتِ وَالأَرْضِ إِلاَّ مَنْ شَاءَ اللهُ﴾ الزمر: ٦٨

"శంఖం ఊదబడుతుంది. దాంతో ఆకాశములోనూ, భూమిలోనూ ఉన్న వారందరూ సొమ్మసిల్లిపోతారు. కాని అల్లాహ్ కోరిన వారు మాత్రం సొమ్మసిల్లరు."

(జుమర్: 68)

ఆ రోజు శుక్రవారం అయి ఉంటుంది. ఆ తర్వాత దూతలు (మలాయికహ్) కూడా చనిపోతారు. పరమ పవిత్రుడైన అల్లాహ్ తప్ప ఎవరూ ఉండరు.

3) సమాధిలో ప్రవక్తలను, (ధర్మయుద్ధంలో మరణించిన అమరవీరులను) తప్ప అందరి దేహాలనూ మట్టి

తినేస్తుంది. కాని వెన్నముకలోని ఒక బీజము మాత్రం అట్లే మిగిలి ఉంటుంది. అల్లాహ్ ఆకాశము నుండి వర్షం కుర్పిస్తే మళ్ళీ దేహం తయారవుతుంది. అల్లాహ్ అందరిని తిరిగి బ్రతికించాలని కోరినప్పుడు శంఖం ఊదటం కోసం నిర్ణయించబడిన దూత ఇస్రాఫీల్‌ను అందరి కంటే ముందు బ్రతికిస్తాడు. ఆ దూత రెండవసారి శంఖం (సూర్) ఊదుతాడు. అప్పుడు అల్లాహ్ సృష్టినంతటిని తిరిగి బ్రతికిస్తాడు. మానవులందరూ ఆ సమయంలో తొలిసారి (మాతృ గర్భం నుండి) వచ్చిన విధంగా నగ్నంగా వడుగులు చేయబడకుండా సమాధుల నుంచి లేచి వస్తారు. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

﴿وَنُفِخَ فِي الصُّورِ فَإِذَا هُمْ مِنَ الأَجْدَاثِ إِلَى رَبِّهِمْ يَنسِلُونَ﴾. يس: ٥١

"శంఖం ఊదబడుతుంది. అప్పుడు వారు తమ సమాధుల నుంచి లేచి తమ ప్రభువు వైపు పరుగెత్తుతారు."
(యాసీన్: 51)

మరోచోట ఇలా సెలవిచ్చాడు:

﴿يَوْمَ يَخْرُجُونَ مِنَ الأَجْدَاثِ سِرَاعًا كَأَنَّهُمْ إِلَى نُصُبٍ يُوفِضُونَ. خَاشِعَةً أَبْصَارُهُمْ تَرْهَقُهُمْ ذِلَّةٌ ذَلِكَ الْيَوْمُ الَّذِي كَانُوا يُوعَدُونَ﴾ المعارج: ٤٣،٤٤

"ఆ రోజున వారు సమాధుల నుంచి లేచి ఒక గుర్తు వైపు పరుగెత్తి పోతున్నట్లు పరుగెత్తిపోతుంటారు. అప్పుడు వారి చూపులు క్రిందికి వాలి ఉంటాయి. అవమానం వారిని క్రమ్ముకుంటున్నట్లు ఉంటుంది. వారికి వాగ్దానం చేయ బడుతున్న రోజు అదే." (మఆరిజ్: 43,44)

అలాహ్ ఆదేశం ప్రకారం అందరికంటే ముందు మన ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) సమాధి నుండి వెడలివస్తారు. అందరూ మహ్షర్ మైదానం వైపు పరుగెత్తుతారు. అదొక సువిశాలమైన ప్రదేశం అయి ఉంటుంది. అవిశ్వాసులు తలక్రిందులై ముఖంతో నడుస్తూ వస్తారు. దైవప్రవక్త (సఅసం) గారి నోట ఈ మాట విన్న ప్పుడు సహచరులు అయన్ని "దైవప్రవక్తా! ముఖాలతో ఎలా నడిచి వస్తారు?" అని సందేహపడుతూ అడిగారు. దానికి అయన "కాళ్ళతో నడిపించే శక్తిగలవాడు ముఖంతో కూడ నడిపిస్తాడు" అని సమాధానమిచ్చారు. ఇహలోకంలో అల్లాహ్ మాటల్ని తిరస్కరించిన వారు అప్పుడు గ్రుడ్డి వారుగా లేపబడతారు. సూర్యుడు మానవులకు అతి

సమీపంలో ఉంటాడు. ప్రతి ఒక్కరు తమ కర్మల ప్రకారం చెమటలో మునిగి ఉంటారు. కొందరు చీలమండల వరకు, కొందరు నడుం వరకు, కొందరు పూర్తిగా మునిగి ఉంటారు. కొందరికి ఆనాడు అల్లాహ్ తన నీడలో స్థానమిస్తాడు. ఆనాడు ఆయన నీడ తప్ప మరే నీడా ఉండదు. ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) చెప్పారు: ఏడు రకాల సుగుణవంతుల్ని అల్లాహ్ ఆనాడు తన నీడ పట్టున ఉంచుతాడు. ఆనాడు ఆయన నీడ తప్ప మరే నీడా ఉండదు. 1) న్యాయశీలుడైన పాలకుడు 2) తన యవన దశను దైవారాధనలో మరియు దైవ విధేయతలో గడిపిన యువకుడు 3) మస్జిద్‌లోనే తన మనసును లగ్నం చేసుకున్న వ్యక్తి 4) కేవలం అల్లాహ్ ప్రసన్నత కోసం పరస్పరం కలిసే, కేవలం ఆయన ప్రసన్నత కోసమే వేరయ్యే ఇద్దరు వ్యక్తులు 5)అందం అంతస్తు ఉన్న ఆడది పాడుపనికి ఆహ్వానిస్తే కేవలం అల్లాహ్‌కు భయపడు తున్నాను అని చెప్పి ఆమెను తిరస్కరించిన వ్యక్తి 6) కుడి చేయి చేసింది ఎడమ చేయికి కూడా తెలియనంత రహస్యంగా దానధర్మాలు చేసే వ్యక్తి 7) ఏకాంతంలో

అల్లాహ్ ధ్యానం చేస్తూ కంట తడిపెట్టిన వ్యక్తి.

ప్రళయ దినాన ఈ లెక్కా విచారణలు కేవలం పురుషులకొక్కరికే కాదు. స్త్రీలకు కూడా వారి కర్మల ప్రకారం లెక్క జరుగుతుంది. సత్కార్యాలు చేసుకున్న వారికి మంచి ఫలితం లభిస్తుంది. దుష్కార్యాలు చేసిన వారికి చెడు ఫలితం లభిస్తుంది. పురుషుల మాదిరిగా వారికి కూడా పూర్తిగా న్యాయం లభిస్తుంది. సంపూర్ణ ప్రతిఫలం ప్రాప్తిస్తుంది.

ఆనాడు మానవులు విపరీతమైన దప్పికకు గురౌతారు. ఆ ఒక్క రోజే యాభై సంవత్సరాలంత సుదీర్ఘంగా ఉంటుంది. అవిశ్వాసులు ఆ రోజు పడే పాట్లు అన్నీ ఇన్నీ కావు. కాని విశ్వాసికి మాత్రం అంత పెద్ద రోజు కూడా ఫర్జ్ నమాజ్ చేసినంత తొందరగా గడిచిపోతుంది. ఆ తర్వాత విశ్వాసులు ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)కు ప్రసాదించబడే "కౌసర్ సరస్సు" వద్దకు వచ్చి "కౌసర్ నీరు" త్రాగుతారు. (కౌసర్ సరస్సు అనేది ఎంతో గొప్ప బహుమానం. దాన్ని అల్లాహ్ ప్రత్యేకంగా మన ప్రవక్తకే

ప్రసాదిస్తాడు. ప్రళయదినాన ఆయన అనుచరులు ఆ సరస్సు నీరు త్రాగుతారు. కౌసర్ జలం పాలకన్నా తెల్లగా, తేనె కన్నా తియ్యగా ఉంటుంది. అందులో నుంచి కస్తూరి కన్నా ఎక్కువ సుగంధభరితమైన వాసన గుభాళిస్తూ ఉంటుంది. ఆకాశంలో ఎన్ని చుక్కలయితే ఉన్నాయో అంతకంటే ఎక్కువ పాత్రలు అక్కడ నీరు త్రాగటానికి ఉంటాయి. ఒకసారి ఆ నీరు త్రాగితే ఇంకెప్పుడూ దాహం వేయదు.

హష్ర్ మైదానంలో ప్రజలు ఎంతో కాలం నిలబడి తమ కర్మల విచారణ మొదలయ్యే ఘడియ కోసం ఎదురు చూస్తూ ఉంటారు. అక్కడి బాధల్ని, ఎండ తీవ్రతను భరించ లేక దైవసన్నిధిలో తమ గురించి సిఫారసు చేసేవారి కోసం వెతుక్కుంటూ ఆదం వద్దకు వస్తారు. ఆయన తన వల్ల కాదని చెబితే నూహ్ ప్రవక్త దగ్గరికి చేరుకుంటారు. ఆయన కూడా ఈ విషయంలో తనను మన్నించవలసిందిగా కోరుకుంటారు. అక్కణ్ణుంచి ఇబ్రాహీం (అలైహిస్సలామ్) వద్దకు, ఆయన దగ్గరి నుంచి మూసా వద్దకు,

తర్వాత ఈసా (అలైహిస్సలామ్) వద్దకు వస్తారు. కాని వారు కూడా ఆ పని తమ వల్ల కాదని అంటారు. అప్పుడు వారంతా ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) వద్దకు వస్తే తను దానికి అర్హుణ్ణని చెప్పి ఆయన అల్లాహ్ సింహాసనం (అర్ష్) క్రింద సాష్టాంగపడి ఆయన్ని స్తుతిస్తూ తనకు ప్రజల గురించి సిఫారసు చేసే అనుమతిని ప్రసాదించమని దీనాతిదీనంగా వేడుకుంటారు. అప్పుడు అల్లాహ్, "ఓ ముహమ్మద్! తల పైకెత్తు. నీ కోరిక తీర్చ గలను. ఏం కావాలో అడుగు. సిఫారసు చేస్తావా చెయ్యి. నీ సిఫారసు ఆమోదించబడుతుంది" అని అంటాడు. తర్వాత కర్మల విచారణ మొదలెట్టటానికి అనుమతి నిస్తాడు. అందరికంటే ముందు ముహమ్మద్ (సఅసం)గారి ఉమ్మతీల (అనగా ఆయన అనుచరుల) తీర్పు జరుగు తుంది.

అక్కడ అన్నింటికంటే ముందు నమాజ్ గురించి ప్రశ్నించబడుతుంది. అందులో ఎవరయితే నెగ్గుతారో వారి కర్మలు మాత్రమే చూడబడతాయి. ఈ నమాజు పరీక్షలో

నెగ్గనివారి కర్మలు త్రోసిపుచ్చబడతాయి. అలాగే మరో ఐదు విషయాల గురించి ప్రశ్నించటం జరుగుతుంది. 1) నీ జీవిత కాలాన్ని ఎటువంటి పనుల్లో గడిపావు? మంచి పనుల్లోనా చెడు పనుల్లోనా? 2) నీ యవ్వనాన్ని ఎటువంటి పనుల్లో కరిగించావు? మంచి పనుల్లోనా చెడు పనుల్లోనా? 3) ధనం ఎలా సంపాదించావు? సంపాదించిన తర్వాత దాన్ని ఎలా ఖర్చు చేశావు? 5) తెలుసుకున్న విషయాలపై ఎంత వరకు ఆచరించావు?

అల్లాహ్ దాసుల మధ్య జరిగే తీర్పుల్లో మొట్టమొదటి తీర్పు అన్యాయంగా రక్తాలు చిందించిన వారి తీర్పు అయి ఉంటుంది. అప్పుడు బాధితులకు నష్టపరిహారం చెల్లించ టానికి దౌర్జన్యం చేసినవారి దగ్గర ఏమీ ఉండదు. తాము చేసుకున్న మంచి లేక చెడు కర్మలే ఆ సమయంలో వారి వెంట ఉంటాయి. అందుకని దౌర్జన్యకారులు ప్రపం చంలో ఏవైనా సత్కార్యాలు చేసి ఉంటే ఆ పుణ్యాలు బాధితులకు పంచబడతాయి. దౌర్జన్యకారుని పుణ్యాలన్నీ పంచి పెట్టిన తర్వాత కూడా చెల్లించవలసిన నష్టపరిహారం

ఇంకా మిగిలి ఉంటే బాధితుల పాపాలు దౌర్జన్యం చేసిన వారిపై మోపబడతాయి.

నరకంపై ఒక వంతెన ఉంటుంది. (ఆ వంతెన వెంట్రుక కన్నా సన్నగా, కత్తికన్నా పదునుగా ఉంటుంది.) ప్రతి ఒక్కరూ తమ కర్మల ప్రకారం దానిపై నుంచి దాటి వెళతారు. కొందరు రెప్పపాటులో, కొందరు వాయువేగంతో, కొందరు అశ్వవేగంతో, కొందరు ప్రాక్కుంటూ ఆ వంతెన దాటి వెళతారు. ఆ వంతెనకు కొన్ని కొక్కెములు కూడా ఉంటాయి. అవి ప్రజల్లో కొందరిని నరకంలో పడవేస్తాయి. అవిశ్వాసులు మరియు విశ్వాసులైన పాపాత్ములే అందులో పడతారు. నరకంలో పడిన అవిశ్వాసులు ఇక శాశ్వతంగా అందులోనే ఉంటారు. కాని విశ్వాసులైన పాపాత్ములు అల్లాహ్ కోరినన్ని రోజులు తమ పాపాలకు శిక్షననుభవించిన తరువాత స్వర్గానికి పంపబడతారు. తౌహీద్ (అనగా అల్లాహ్ మాత్రమే ఆరాధ్యనీయుడు అని) సాక్ష్యమిచ్చిన పాపాత్ముల గురించి సిఫారసు చేసే అనుమతిని అల్లాహ్,

తను ఇష్టపడిన ప్రవక్తలకు, మహా భక్తులకు ప్రసాదించి వారి సిఫారసుతోనే ఆ పాపాత్ములను నరకం నుంచి తీసి స్వర్గానికి పంపటం జరుగుతుంది. వంతెన దాటిన తరువాత, స్వర్గానికి అర్హులైనవారు స్వర్గం-నరకం మధ్యలో ఆగి ఉంటారు. అక్కడ వారి పరస్పర అన్యాయాల గురించి తీర్పు చేయటం జరుగుతుంది. వారి హృదయాలలో కాస్తో కూస్తో కల్మషం ఉంటే అది కూడా తొలగించబడుతుంది. ఆ తర్వాత వారు నరకంలోకి ప్రవేశిస్తారు. స్వర్గస్తులు స్వర్గంలోకి, నరకవాసులు నరకంలోకి ప్రవేశించిన తర్వాత వారందరి కళ్లముందే మృత్యువును ఒక పొట్టేలు రూపములో తీసుకువచ్చి దానిని స్వర్గనరకాల మధ్య జిబహ్ చేయటం జరుగుతుంది. తర్వాత ఇలా అనబడు తుంది: ఓ స్వర్గవాసులారా! శాశ్వతంగా ఉండండి ఇక మీకు మరణం లేదు. ఓ నరకవాసులారా! శాశ్వతంగా ఉండండి. మీకు కూడా ఇక ఎన్నటికీ మరణం సంభ వించదు.

వేరొక చోట వారిని సంకెళ్ళతో కట్టి బేడీలు వేయబడతాయని చెప్పబడింది:

﴿ إنَّ شَجَرَةَ الزَّقُّومِ، طَعَامُ الأَثِيمِ، كَالْمُهْلِ يَغْلِي فِى الْبُطُون، كَغَلْيِ الْحَمِيمِ ﴾
الدخان: ٤٣-٤٦

“ఆ రోజున పాపాత్ములకు సంకెళ్ళు తగిలించబడతాయి. వారి దుస్తులు గంధకముతో చేయబడి ఉంటాయి. అగ్ని వారి ముఖాలను కమ్ముకుంటుంది.”

(ఇబ్రాహీం: 49,50)

వారి తిండి విషయం ఇలా ప్రస్తావించబడింది:

﴿ إنَّ شَجَرَةَ الزَّقُّومِ، طَعَامُ الأَثِيمِ، كَالْمُهْلِ يَغْلِي فِى الْبُطُون، كَغَلْيِ الْحَمِيمِ ﴾
الدخان: ٤٣-٤٦

“నిశ్చయముగా జెముడు వృక్షం పాపిష్టులకు ఆహారమవుతుంది. అది నూనె మడ్డిలాగుంటుంది. అది కడుపులో సలసల కాగే నీళ్ల లాగా కాగుతూ ఉంటుంది.”

(దుఖాన్: 43-46)

ఇప్పుడు ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)గారి ఒక ప్రవచనం చూడండి: జఖ్కూం చెట్టు (యొక్క పసరు) ఒక్క చుక్కయినా భూమ్మీద పడిందంటే భూమిపై ఉండే

జీవరాశుల యొక్క ఆహారమంతా చెడిపోతుంది. అది తినేవారి కొరకు ఎంత బాధాకరంగా ఉంటుందను కుంటున్నారు?!

నరక శిక్షల కాఠిన్యతను, స్వర్గశుభాల కమ్మదన్నాన్ని దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా విశదీ కరించారు: ప్రపంచంలో అందరికంటే ఎక్కువ సుఖాలను అనుభవించిన అవిశ్వాసిని ఒకసారి నరకాగ్నిలో ముంచి తీసి, " నీవు ఎప్పుడైనా సుఖాన్ని అనుభవించావా?" అని ప్రశ్నిస్తే, "లేదు, ఎప్పుడూ లేదు" అని బదులిస్తాడు. అలాగే ప్రపంచంలో అందరికంటే ఎక్కువ బీదరికాన్ని, కష్టాలను, బాధలను అనుభవించిన మరొక విశ్వాసిని ఒకసారి స్వర్గం లోకి ప్రవేశింపజేసి ఆ తర్వాత " నీవు ఎప్పుడైనా కష్టాలను అనుభవించావా?" అని అడిగితే, దానికి అతను, "లేదు, నేను ఎన్నడూ కష్టాలను అనుభవించలేదు" అని బదు లిస్తాడు. ఒకసారి స్వర్గంలో మునిగి లేవగానే ఇహలోకపు బాధలు, కష్టాలు అన్నీ మరిచిపోతాడు మనిషి.

# స్వర్గము

దేవుని ప్రియ దాసుల కొరకు స్వర్గం ఓ శాశ్వతమైన, అత్యంత పవిత్రమైన, శుభప్రదమైన నివాసము. దాన్ని ఏ కళ్ళూ చూడలేదు. ఏ చెవులూ వినలేదు. అసలు దానిగురించి ఏ హృదయమూ ఊహించనయినా ఊహించ జాలదు. కావాలంటే దివ్య ఖుర్‌ఆన్‌లోని ఈ వాక్యం చూడండి.

﴿فَلَا تَعْلَمُ نَفْسٌ مَا أُخْفِيَ لَهُمْ مِنْ قُرَّةِ أَعْيُنٍ جَزَاءً بِمَا كَانُوا يَعْمَلُونَ﴾ السجدة: ١٧

"వారి కర్మలకు ప్రతిఫలంగా, కళ్లకు చలువ కలిగించే ఎటువంటి సామగ్రి వారి కొరకు దాచిపెట్టబడిందో ఆ సామగ్రిని గురించి ఏ ప్రాణికి తెలియదు." (సజ్దా: 17)

స్వర్గంలో కూడా స్థానాలు ఉన్నై. విశ్వాసులు తాము ఆచరించిన కర్మలను బట్టి స్వర్గంలో తాము ఆచరించిన స్థానాలకు చేరుకుంటారు. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

﴿يَرْفَعِ اللهُ الَّذِينَ آمَنُوا مِنكُمْ وَالَّذِينَ أُوتُوا الْعِلْمَ دَرَجَاتٍ﴾ المجادلة: ١١

"మీలో విశ్వాసులైనవారి, విద్యగలవారి స్థానాలను అల్లాహ్ ఉన్నతం చేస్తాడు." (ముజాదలహ్: 11)

స్వర్గవాసులు స్వర్గంలో తమ ఇష్టానుసారం తింటూ

తాగుతూ హాయిగా ఉంటారు. అందులో స్వచ్ఛమైన నీటి సెలయేరులు, ఏ మాత్రము రుచి మారని పాల ఝరులు, అందమైన స్వర్గ తోటల మధ్య నుంచి పరవళ్లు తొక్కుతూ ప్రవహించే తేనీయల కాలువలు ఉంటాయి. ఇంకా కమ్మటి మద్యం కూడా ఉంటుంది. కాని ఆ మద్యం ప్రపంచపు మద్యంలాగుండదు. అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

﴿ يُطَافُ عَلَيْهِمْ بِكَأْسٍ مِنْ مَعِينٍ، بَيْضَاءَ لَذَّةٍ لِلشَّارِبِينَ، لاَ فِيهَا غَوْلٌ وَلاَهُمْ عَنْهَا يُنْزَفُون ﴾ الصافات: ٤٥-٤٧

"పరిశుభ్రమైన ద్రాక్ష రసములతో నిండిన గిన్నెలు వారి వద్దకు తీసుకురాబడతాయి. ఆ పానీయం తెల్లగానూ, త్రాగటానికి కమ్మగానూ ఉంటుంది. దాన్ని సేవించటం వల్ల తల తిరగటం, మతి చెడటం వంటివేమీ జరగవు." (సాప్ఫాత్:45-47)

స్వర్గవాసులకు స్వర్గంలో అందమైన పెద్ద పెద్ద కన్నులు గల సుందరాంగులతో (హూరె ఐన్‌తో) వివాహం జరుగుతుంది. ఆ స్వర్గకన్యల గురించి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా వివరించారు: స్వర్గపు స్త్రీ ఒక్కసారి ప్రపంచంలోకి తొంగి చూసిందంటే భూమి- ఆకాశముల మధ్య ప్రదేశమంతా వెలుగుతో నిండిపోతుంది. వాటి మధ్య

సువాసనలు గుభాళిస్తాయి. స్వర్గవాసులకు ఎన్నో వరాలు లభిస్తాయి. ఆ వరాలన్నింటిలోకెల్లా అతి గొప్ప వరం అల్లాహ్ దర్శన భాగ్యం. స్వర్గవాసులకు మలము, మూత్రము, ఉమ్మి లాంటి ఇబ్బందులేవీ ఉండవు. దువ్వుకోవటానికి వారికి బంగారపు దువ్వెనలు ఉంటాయి. వారి చెమటలో కస్తూరి లాంటి సువాసన వస్తూ ఉంటుంది. ఈ వరాలు ఎన్నటికీ తరగవు. వాటికి నశింపు లేదు. అవి శాశ్వతంగా ఉంటాయి. ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా చెప్పారు: "స్వర్గంలో చేరినవారు ఎన్నటికీ ముసలి వారు కారు. వారి సుఖాలకు అంతముండదు. వారిలో అతి తక్కువ అదృష్టవంతుడు అందరికంటే చివరిలో స్వర్గంలోకి చేరినవాడు. అతనికి లభించే స్వర్గమే పది ప్రపంచాల కంటే ఎంతో ఘనంగా ఉంటుంది."

وصلى الله وسلم وبارك على نبينا محمد وآله وصحبه أجمعين.

వ సల్లల్లాహు వ సల్లమ వ బారక అలా నబియ్యినా ముహమ్మదిన్ వ ఆలిహీ వ సహ్‌బిహీ అజ్‌మయీన్.